సాక్షి
నల్లగొండ
మంగళవారం : 23 : ఏప్రిల్ : 2024



**బీజేపీ భారీ ర్యాలీ**
బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి నామినేషన్ సందర్భంగా సోమవారం నల్లగొండలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. - 8లో



**మతోన్మాదులపై సీపీఎం పోరు**
మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడేది ఎర్రజెండానే అని సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి అన్నారు. - 8లో

గరిష్ఠం / కనిష్ఠం
41° / 26°

**వాతావరణం**
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### నేడు మంత్రి కోమటిరెడ్డి రాక

నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంగళవారం నల్లగొండకు రానున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి బయల్దేరి మధ్యాహ్నం చిట్యాల మండలం చిన్నకాపర్తికి వచ్చి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం నల్లగొండలోని తన క్యాంపు ఆఫీస్‌కు చేరుకుని మధ్యాహ్నం 2గంటలకు మీడియా సమావేశంలో మాట్లాడనున్నారని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

### పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ

నల్లగొండ క్రైం: విధి నిర్వహణలో మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ చందనా దీప్తి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏహెచ్‌పీయూ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌కె.నజీర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబానికి మంజూరైన రూ.8లక్షల చెక్కును సోమవారం ఆయన భార్య సయ్యద్ సనా సమేరన్‌కు ఎస్పీ చందనా దీప్తి అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్‌ను ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ సబిత, జూనియర్ అసిస్టెంట్ ప్రమోద పాల్గొన్నారు.

### నేడు బీఆర్‌ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డి నామినేషన్

నల్లగొండ టూటౌన్: బీఆర్‌ఎస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా కంచర్ల కృష్ణారెడ్డి మంగళవారం నామినేషన్ వేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ కార్యక్రమం సందర్భంగా నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్ నుంచి వీటీకాలనీ, ఎన్జీ కాలనీ, గడియారం సెంటర్, రాష్ట్రపతి రోడ్డు, భాస్కర్ టాకీస్, బీటీఎస్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు ర్యాలీ ప్రారంభం కానందని పేర్కొన్నారు. ఈ ర్యాలీకి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

### అనాథ బాలికలకు పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి ఆహ్వానం

నల్లగొండ: అనాథ, నిరుపేద, తల్లిదండ్రుల ఆదరణ కోల్పోయిన, అక్రమ రవాణాకు గురైన బాలికలకు ఎలాంటి అర్హత పరీక్ష లేకుండా హైదరాబాద్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సక్కుబాయి తెలిపారు. అనాథ బాలికలైతే తల్లిదండ్రుల డెత్, స్టడీ, బోనఫైడ్ సర్టిఫికెట్లు, 2 పాస్ ఫొటోలు, పదో తరగతి పాసైన విద్యార్థినులు మే 20వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు బాలభవన్‌లో ఫోన్ : 08682 232923 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### బీఆర్‌ఎస్‌కు మున్సిపల్ మాజీ చైర్మన్ రాజీనామా

మిర్యాలగూడ: లోక్‌సభ ఎన్నికల వేళ మిర్యాలగూడలో బీఆర్‌ఎస్ పార్టీ భారీ షాక్ తగిలింది. మిర్యాలగూడకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతుండడంతో ఆ పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నాయి. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మిర్యాలగూడ మున్సిపల్ మాజీ చైర్మన్ గార్లపాటి నిరంజన్‌రెడ్డి, 25వ వార్డు కౌన్సిలర్ వంగాల నిరంజన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మైనార్టీ జిల్లా సీనియర్ నాయకుడు ఎండీ.మదార్‌బాబా, నీటి సంఘం మాజీ చైర్మన్ గార్లపాటి శ్రీనివాస్‌రెడ్డిలు సోమవారం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేస్తామని వారు అన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నాయకత్వంలో పనిచేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మునీర్, గౌస్‌ఖాన్, తులసి, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఓటర్లే కీలకం

## నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో అతివలే అత్యధికం

- ఒక్క అసెంబ్లీ సెగ్మెంట్‌లోనే ఎక్కువ మంది పురుషులు
- మిగతా ఆరు చోట్ల మహిళలే ఎక్కువ
- ఓటు వినియోగించుకోవడంలోనూ వారే ముందు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. మొత్తం ఓటర్లలో వారే అత్యధికంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో వారి తీర్పే కీలకం కానుంది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం 17,22,521 మంది ఓటర్లుండగా, అందులో పురుషులు 8,43,496 మంది, మహిళలు 8,78,856 మంది, ట్రాన్స్‌జెండర్లు 169 మంది ఉన్నారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఒక్క అసెంబ్లీ నియోజకవర్గం మినహా మిగతా ఆరింటిలో మహిళా ఓటర్లే ఎక్కువ ఉన్నారు.

**హుజూర్‌నగర్‌లో అత్యధికం**

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, అందులో ఒక్క దేవరకొండ సెగ్మెంట్‌లోనే పురుషులు అధికంగా ఉన్నారు. మిగతా ఆరింటిలో హుజూర్‌నగర్ నియోజకర్గంలో మహిళ ఓటర్లు మిగతా వాటికంటే అత్యధికంగా ఉన్నారు. అక్కడ పురుషుల కంటే మహిళా ఓటర్లు 7,497 మంది ఎక్కువగా ఉన్నారు. ఇక నాగార్జునసాగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 4,754 మంది మహిళ ఓటర్లు ఉండగా, మిర్యాలగూడలో 4,756 మంది, కోదాడలో 6,810 మంది, సూర్యాపేటలో 6,123, నల్లగొండ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 6,687 మంది మహిళ ఓటర్లు పురుషుల కంటే ఎక్కువగా ఉన్నారు. దేవరకొండ నియోజకవర్గంలో మాత్రం మహిళల కంటే ఎక్కువ మంది (1267 మంది) పురుష ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికల్లో మహిళలను ఏయే పార్టీలు అధికంగా తమ వైపునకు మళ్లించుకుంటాయనేది ఎన్నికల తరువాత వెల్లడి కానుంది.

**మహిళలే చైతన్యవంతులు**

2019 పార్లమెంట్ ఎన్నికల్లో చైతన్యవంతులు మహిళలే అని నిరూపించుకున్నారు. అత్యధికంగా ఓటింగ్‌లో పాల్గొన్నది వారే. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 15,85,406 మంది ఓటర్లు ఉండగా, ఒక ట్రాన్స్‌జెండర్ కలుపుకొని 11,75,129 ఓట్లు పోల్ అయ్యాయి. 74.13 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో 7,84,111 మంది పురుష ఓటర్లు ఉంటే, 8,01,295 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అంటే పురుషుల కన్నా 17,184 మహిళా ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. ఇక ఆ ఎన్నికల్లో 5,86,181 మంది పురుష ఓటర్లు, 5,88,947 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల కంటే మహిళలే ఎక్కువగా (2,760 మంది) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అప్పట్లో మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట, నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళ ఓట్లే ఎక్కువగా పోల్ అయ్యాయి.

**ప్రస్తుతం నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో ఓట్ల వివరాలు**

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ట్రాన్స్‌జెండర్లు | మొత్తం |
|---|---|---|---|---|
| దేవరకొండ(ఎస్టీ) | 131659 | 130392 | 18 | 262069 |
| నాగార్జునసాగర్ | 115710 | 120464 | 21 | 236195 |
| మిర్యాలగూడ | 115543 | 120299 | 26 | 235868 |
| హుజూర్‌నగర్ | 121667 | 129164 | 17 | 250848 |
| కోదాడ | 119068 | 125878 | 18 | 244964 |
| సూర్యాపేట | 118770 | 124893 | 13 | 243676 |
| నల్లగొండ | 121079 | 127766 | 56 | 248901 |
| మొత్తం | 843496 | 878856 | 169 | 1722521 |

**2019 ఎన్నికల్లో పోలింగ్ సరళి ఇలా..**

| | మొత్తం ఓట్లు | | పోలైన ఓట్లు | |
|---|---|---|---|---|
| నియోజకవర్గం | పురుష | మహిళ | పురుష | మహిళ |
| దేవరకొండ | 118826 | 116445 | 80684 | 78370 |
| నాగార్జునసాగర్ | 107710 | 109585 | 78358 | 78110 |
| మిర్యాలగూడ | 109236 | 112034 | 80854 | 82635 |
| హుజూర్‌నగర్ | 115626 | 119682 | 93766 | 91773 |
| కోదాడ | 111931 | 116375 | 87458 | 90885 |
| సూర్యాపేట | 109768 | 113139 | 81049 | 82331 |
| నల్లగొండ | 111014 | 114035 | 84012 | 84843 |
| మొత్తం | 784111 | 801295 | 586181 | 588947 |

## బీజేపీ, బీఆర్‌ఎస్‌కు డిపాజిట్లు దక్కవు



సభలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, జానా, ఎమ్మెల్యేలు

- లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్‌దే
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- హాలియాలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల బహిరంగ సభ

హాలియా: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు డిపాజిట్లు గల్లంతుకావడం ఖాయమని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎస్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హాలియా పట్టణంలోని పాత ఐటీఐ కళాశాల ప్రాంగణంలో సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల బహిరంగ సభకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్లమెంట్ సాక్షిగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, రైతులు పండించిన పంటకు మద్దతు ధర ఇస్తామని మోసం చేశారని ఆరోపించారు.గతంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు చేయని బీజేపీ ఈ ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతుందని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణలో నామరూపాల్లేకుండా పోవడం ఖాయమన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు కాంగ్రెస్‌దేనని, ఇండియా కూటమి ఆధిక్యం సాధిస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధాని కాబోతున్నారని జోస్యం చెప్పారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డికి దేశంలోనే అత్యధిక మెజార్టీ రాబోతోందన్నారు. ఎన్నికల అనంతరం అర్హులైన వారందరికీ కొత్తరేషన్ కార్డులు అందజేస్తామన్నారు. మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి మాట్లాడుతూ తాను నెరవేర్చని వాటిని నెరవేర్చేందుకు నా తనయులను రాజకీయాల్లోకి తీసుకొచ్చానన్నారు. పదవి ఉన్నా లేకున్నా జీవితాంతం ప్రజల కోసం పాటుపడుతానన్నారు. దేశంలోనే నల్లగొండ స్థానంలో అత్యధిక మెజార్టీ సాధించిన రావి నారాయణరెడ్డిని మించిన మెజార్టీతో రఘువీర్‌రెడ్డిని గెలిపించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషిచేయాలని ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవరకొండ, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మహిళా అధ్యక్షురాలు గోపగాని మాధవి, పీసీసీ కార్యదర్శి పున్నా కైలాస్‌నేత, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కాకునూరి నారాయణ గౌడ్, కుందూరు వెంకట్‌రెడ్డి, మలిగిరెడ్డి లింగారెడ్డి, చింతల చంద్రారెడ్డి, గౌనీ రాజా రమేష్ యాదవ్, వెంపటి శ్రీనివాస్, జెడ్పీటీసీలు ధనావత్ భారతిబాస్కర్‌నాయక్, నందికొండ రామేశ్వరీ, రవికుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



హాలియాలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

## నాలుగో రోజు పదిమంది నామినేషన్లు

- బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తరఫున రెండోసారి..
- నల్లగొండ లోక్‌సభ స్థానానికి మొత్తం 22 నామినేషన్లు దాఖలు



నల్లగొండలో బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న శానంపూడి సైదిరెడ్డి

నల్లగొండ: నల్లగొండ లోక్‌సభ స్థానానికి సోమవారం పది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో బీజేపీ తరఫున శానంపుడి సైదిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఇంకా ఆధార్ పార్టీ (అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫన్స్ పార్టీ) తరపున ఏడనాగ్ పుల్లారావు, ఎంసీపీఐ తరపున వసుకుల మట్టయ్య, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య, రిపబ్లిక్ పార్టీ అభ్యర్థిగా వంగపల్లి కిరణ్, ధర్మసమాజ్ పార్టీ నుంచి తలారి రాంబాబు నామినేషన్ దాఖలు చేశారు. ఇక, స్వతంత్ర అభ్యర్థులుగా పానుగోతు లాల్‌సింగ్, మర్రి నెహేమియా, చీదల్ల వెంకటసాంబశివరావు, లింగం కృష్ణ ఉన్నారు. ఇందులో బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి తలారి రాంబాబు, ఎంసీపీఐ అభ్యర్థి వసుకుల మట్టయ్యలు రెండోసారి నామినేషన్లు దాఖలు చేశారు. కొత్తవారు ఏడుగురు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. గత మూడు రోజుల్లో 15 మంది, నాలుగో రోజు ఏడుగురితో కలిపి మొత్తం 22 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

### భువనగిరిలో 11 మంది..



భువనగిరిలో నామినేషన్ వేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్

భువనగిరి టౌన్: భువనగిరి లోక్‌సభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా సోమవారం 11 మంది అభ్యర్థులు 14 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్, పీపుల్స్ ప్రొటెక్షన్ తరపున వింద్యాల సదానందరెడ్డి, స్వతంత్ర అభ్యర్థి ఈదుల వీర పాపయ్య రెండు సెట్ల చొప్పున నామినేషన్లు వేశారు. వీరితో పాటు జై భారత్ నేషనల్ పార్టీ నుంచి నల్ల కరుణాకర్‌రెడ్డి, ఇండిపెండెంట్‌లు భాషబోయిన లక్ష్మయ్య, వరికుప్పల కృష్ణ, కొంగరి మల్లయ్య, గాదేపాక అనిల్‌కుమార్, నక్కల సురేందర్, తెలంగాణ రిపబ్లిక్ పార్టీ అభ్యర్థి కందాడి మణిపాల్‌రెడ్డి, ధర్మ సమాజ్ పార్టీ నుంచి కొంగర లింగస్వామి ఒక్కో సెట్ నామినేషన్ వేశారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలు స్వీకరించారు.

### రేపటి నుంచి వేసవి సెలవులు

నల్లగొండ: ఈ నెల 24వ తేదీ నుంచి ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించినట్లు నల్లగొండ డీఈఓ భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలవు రోజుల్లో జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించకూడదని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా తరగతులు నిర్వహిస్తే ఆయా పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వారంలోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలి

- డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

నార్కట్‌పల్లి: వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు, పల్లెపహాడ్, నెమ్మాని గ్రామాలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం నార్కట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో చిట్యాల, నార్కట్‌పల్లి మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి అమ్మనబోలు గ్రామంలో పీఏసీఎస్ సెంటర్లలో తడిసిన ధాన్యాన్ని కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు కొనుగోలు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 370 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 28,276 మంది రైతుల నుంచి 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, రూ.182.77కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. సమావేశంలో డీఎం నాగేశ్వర్‌రావు, డీసీఓ కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, తరుణ్, లింగస్వామి పాల్గొన్నారు.

**ధాన్యం కొనుగోళ్ల పట్ల సంతృప్తి**

నల్లగొండ: జిల్లాలో రికార్డు స్థాయిలో యాసంగి ధాన్యం కొనుగోలు చేయడం పట్ల రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ చౌహాన్ సంతృప్తి చెంది జిల్లా యంత్రాంగాన్ని అభినందించారని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. 2023–24 యాసంగి ధాన్యం సేకరణపై సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల పౌరసరఫరాల శాఖ అధికారులు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎస్‌ఓ మాట్లాడారు. కాన్ఫరెన్స్‌కు డీఎం నాగేశ్వరరావు, డీసీఓ కిరణ్ కుమార్, డీఏఓ శ్రవణ్ కుమార్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి హాజరయ్యారు.

# అకాల వర్షంతో రైతన్నకు నష్టం



చిట్యాల: వెలిమినేడులో ధాన్యం రాశుల మధ్య చేరిన వర్షపునీరు



చిట్యాల: వెలిమినేడులో రాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు

- వెలిమినేడులో తడిసిన ధాన్యం
- నేలరాలిన మామిడి కాయలు
- వనిపాకల, నార్కట్‌పల్లిలో లేచిపోయిన ఇళ్ల పైకప్పులు

చిట్యాల: మండలంలోని పలు గ్రామాలతోపాటు చిట్యాల మున్సిపాలిటీలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ అకాల వర్షం కురిసింది. దీంతో వెలిమినేడు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలోకి రైతులు తీసుకొచ్చిన ధాన్యం తడిచిపోయింది. రైతులు ఆరబెట్టిన ధాన్యపు రాశులకు మధ్య వర్షపునీరు చేరింది. నేరడలోని ఓ రైస్ మిల్లుపై పిడుగు పడింది. వనిపాకలలోని పలు ఇళ్ల పైకప్పు రేకులు గాలి దుమారానికి లేచిపోగా, విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. వెలిమినేడు, గుండ్రాంపల్లిలో మామిడి తోటల్లోని మామిడి కాయలు నేలరాలిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గాలిదుమారంతో కూడిన వర్షం రావడం వల్ల చిట్యాల మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

**నిమ్మ చెట్లు నేలమట్టం**

నార్కట్‌పల్లి: మండలంలో ఆదివారం రాత్రి గాలిదుమారంతో కూడిన అకాల వర్షం కురిసింది. చిన్నతుమ్మలగూడెం గ్రామానికి చెందిన వర్రె నరసింహ నిమ్మ తోటలోని దాదాపు 25 వరకు చెట్లు నేలకూలాయి. నార్కట్‌పల్లి పట్టణంలోని మాంద్ర రోడ్డులో గౌతం సుజాత ఇంటి రేకులు పూర్తిగా లేచిపోయినట్లు బాధితురాలు తెలిపారు.



చిన్నతుమ్మలగూడెంలో నేలకూలిన నిమ్మ చెట్టు

## బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలను వినియోగించుకోవాలి



సింగరాజుపల్లి గ్రామంలో బీఎస్‌ఎన్‌ఎల్ టవర్‌ను ప్రారంభిస్తున్న ఆ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ నిర్మల్

డిండి: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో బీఎస్‌ఎన్‌ఎల్ ద్వారా అందిస్తున్న 4జీ మొబైల్ సేవలను వినియోగించుకోవాలని బీఎస్‌ఎన్‌ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ పీజీ.నిర్మల్ వినియోగదారులకు సూచించారు. రాష్ట్రంలో బీఎస్‌ఎన్‌ఎల్ ద్వారా మొట్టమొదటి సారిగా సోమవారం మండల పరిధిలోని సింగరాజుపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 4జీ స్యాచురేషన్ టవర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్ 2జీ, 3జీ టవర్లనను త్వరలోనే 4జీ టవర్లుగా ఆధునీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం.మురళి,డీజీఎం రవి ప్రసాద్,దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, సీఓఓ సూర్యమూర్తి, మాజీ సర్పంచ్ రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ధర్నా

నార్కట్‌పల్లి: మండలంలోని అమ్మనబోలు గ్రామంలో గల ధాన్యాం కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పలువురు రైతులు స్థానికంగా నార్కట్‌పల్లి- మోత్కూర్ రహదారిపై ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం తడిసిన రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ జాన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు బొడిగె భరత్, కొమ్ము యాదగిరి, శ్రీనివాస్, జాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అమ్మనబోలులో రోడ్డుపై ధాన్యం పోసి ధర్నా చేస్తున్న రైతులు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

## ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకులదే కీలకపాత్ర



శిక్షణకు హాజరైన సూక్ష్మ పరిశీలకులు

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకులదే కీలకపాత్ర అని ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రవణ్ అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని జిల్లా పరిషత్ ఆడిటోరియం హాల్‌లో సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొదటి విడతలో భాగంగా 374మంది సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల్లో పాటించాల్సిన నియమ నిబంధనలను ఆయన వివరించారు. పోలింగ్ అయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ పోలింగ్ రోజున ఎన్నికల పరిశీలకులకు చెక్ లిస్ట్‌లో అన్ని వివరాలు రిపోర్ట్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎల్డీఎం శ్రామిక్, మాస్టర్ ట్రైనర్ బాలు, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ భారీ ర్యాలీ

- నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డు నుంచి క్లాక్‌టవర్ వరకు బైక్ ర్యాలీ
- హాజరైన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి నామినేషన్ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డు నుంచి గడియారం సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీకి కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్లాక్‌టవర్ సెంటర్‌లో జనసందోహం నెలకొంది. ఈ సందర్భంగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రసంగం కార్యకర్తల్లో జోష్ నింపింది. కార్యకర్తలు నినాదాలు, ఈలలతో సభ హోరెత్తించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, నూకల నరసింహారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజు యాదవ్, పోతెపాక సాంబయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### శానంపూడిని గెలిపిస్తే ఇండస్ట్రియల్ కారిడార్

దేశం కోసం మోదీ అని, నల్ల గొండ కోసం సైదిరెడ్డి అని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలుగులో ప్రసంగం మొదలుపెట్టారు. శానంపూడి సైదిరెడ్డిని ఎంపీగా గెలిపిస్తే జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### భారీ మెజార్టీతో గెలవబోతున్నా..

తాను నల్లగొండ ఎంపీగా భారీ మెజార్టీతో గెలవబోతున్నానని బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ప్రమాణం చేస్తున్నారని, కాంగ్రెస్ అంటేనే స్కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు. మూడు కుటుంబాలు జిల్లాను ఏలుతున్నాయని, కానీ జిల్లా మాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. కుటుంబ పాలన కావాలో, అభివృద్ధి చేసే మోదీ కావాలో ప్రజలు ఆలోచన చేయాలని కోరారు.



నల్లగొండ పట్టణంలో శానంపూడి సైదిరెడ్డి నామినేషన్ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు (ఇన్‌సెట్లో) కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు భారీ గజమాలతో సన్మానం

### నల్లగొండలో కాషాయ జెండా ఎగరాలి

బీజేపీ కార్యకర్తల ఉత్సాహం చూస్తే కాంగ్రెస్‌కు దడ పుడుతోందని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఇక్కడ బీజేపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎమ్మెల్యేలు లేకున్నా ప్రధాని మోదీ జిల్లాకు జాతీయ రహదారులు ఇచ్చారని తెలిపారు. నల్లగొండలో కాషాయం జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు ఒక్కొక్కరు వంద ఓట్లు వేయిస్తే సైదిరెడ్డి 2లక్షల మెజార్టీతో గెలుస్తారన్నారు. జిల్లాలో ఉత్తమ్, జానారెడ్డి, కోమటిరెడ్డిల కుటుంబ పాలనకు స్వస్తి చెప్పాలన్నారు.



క్లాక్‌టవర్ సెంటర్‌లో మీటింగ్‌కు హాజరైన బీజేపీ కార్యకర్తలు

## సైదిరెడ్డి ఆస్తులు రూ.31.33 కోట్లు

నల్లగొండ: నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి తన కుటుంబ ఆస్తులు రూ.31,33,55,479గా ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో చూపించారు. అదేవిధంగా రూ.6,10,9,131 అప్పులు ఉన్నట్లు పేర్కొన్నారు. సోమవారం నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేశారు. తన చేతిలో రూ.45వేల నగదు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ డీసీసీబీ బ్యాంకులో రూ.7,97,650, యూనియన్ బ్యాంకులో రూ.3,60,940, ఎస్‌బీఐలో రూ.18,17,072, ఐసీఐసీఐ బ్యాంకులో రూ.10లక్షల డిపాజిట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపించారు. తన భార్య చేతిలో రూ.45వేల నగదు, హైదరాబాద్‌లోని డీసీసీబీ బ్యాంకులో రూ.2,95,719 డిపాజిట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. డిపెండెంట్-1 పేరున రూ.22,800, డిపెండెంట్-2 పేరున రూ.30,895 బ్యాంకుల్లో ఉన్నట్లు చూపించారు. సైదిరెడ్డి పేరున రూ.50వేల విలువ చేసే షేర్లు, ఆయన భార్య పేరున మరో రూ.50వేల విలువ చేసే షేర్లు చూపించారు. ఎస్‌జీ పవర్ ప్రాజెక్టులో తన భార్య పేరున రూ.1,57,43,752 విలువ చేసే పెట్టుబడులు ఉన్నట్లు పేర్కొన్నారు. సైదిరెడ్డి వద్ద 270 గ్రాముల బంగారం ఉన్నట్లు చూపగా, తన భార్య వద్ద కిలోన్నర బంగారం ఉన్నట్లు చూపించారు.

**అప్పులు రూ.6.10 కోట్లు..**

సైదిరెడ్డి పేరున చరాస్తి రూ.5,34,01850 ఉన్నట్లు చూపగా.. తన భార్య పేరున రూ.15,62,80,000 స్థిరాస్తి ఉన్నట్లు చూపించారు. అప్పులు సైదిరెడ్డి పేరున రూ.91 లక్షలు. తన భార్య పేరున రూ.5,19,9,131 ఉన్నట్లు చూపించారు.

### స్థిర, చరాస్తులు..

సైదిరెడ్డి పేరున చరాస్తులు రూ.4,47,52,548, తన భార్య పేరున చరాస్తులు రూ.5,89,21,081 ఉన్నట్లు చూపారు. సైదిరెడ్డికి సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌లో 2.25 ఎకరాలు, మరో చోట 1.30 ఎకరాలు, 1.29 ఎకరాలు, సూర్యాపేట జిల్లా చివ్వెంలలో 3 ఎకరాల భూమి ఉన్నట్లు చూపించారు. దురాజ్‌పల్లిలో ఒక చోట 7,200 స్క్వేర్ యార్డ్స్, మరో చోట 31,366 స్క్వేర్ యార్డ్స్, కోదాడలో 409.5 స్క్వేర్ యార్డ్స్ స్థలం ఉన్నట్లు చూపగా టీవీబీ పాలెంలో 438 స్క్వేర్ యార్డ్స్ స్థలంతో పాటు కెనడాలో 2 నివాస భవనాలు ఉన్నట్లు పేర్కొన్నారు. తన భార్య పేరున షామీర్‌పేటలోని దేవరయాంజాల్‌లో 9వేల స్క్వేర్ యార్డ్స్ భవనంతో పాటు సూర్యాపేటలోని దేశాయిగూడెంలో 12,221 స్క్వేర్ యార్డ్స్ స్థలం ఉంది.

## క్యామ మల్లేష్‌పై పోలీసు కేసులు లేవు

- ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి
- రూ.145 కోట్ల స్థిర, చరాస్తులు

సాక్షి, యాదాద్రి: తనపై ఎటువంటి పోలీసు కేసులు లేవని బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ తన ఎన్నికల నామినేషన్ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సోమవారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. అఫిడవిట్‌లో తనతో పాటు తన భార్య జంగమ్మ పేరు మీద స్థిరాస్తులు రూ.3,36,16,521, చరాస్తులు 141,98,76,000 ఉన్నట్లు పేర్కొన్నారు. అందులో మల్లేష్ పేరున స్థిరాస్తులు రూ.2,15,79,701 కాగా, భార్య జంగమ్మ పేరు మీద రూ.1,20,36820 ఉన్నట్లు చూపించారు. చరాస్తులు తన పేరు మీద రూ.116,98,76,000, భార్య పేరుపై రూ.25 కోట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మల్లేష్ పేరు మీద అప్పు రూ.48,30,037, భార్య పేరు మీద రూ.15,16,459 అప్పుగా చూపించారు. మల్లేష్ చేతిలో రూ.60,000. తన భార్య చేతిలో రూ.40,000 నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎల్ఐసీ పాలసీలు తన పేరు మీద రూ.14.50 లక్షలు, భార్య పేరుపై రూ.2లక్షలు ఉన్నాయని, రూ.7లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు మల్లేష్ పేరున, కిలో బంగారం భార్య పేరున ఉందని పేర్కొన్నారు. టయోటా, మెర్సిడెస్ బెంజ్ కార్లు మల్లేష్ పేరున, మరో ఇన్నోవా కారు భార్య పేరున ఉంది.

# తెలంగాణ ప్రజల కోసం కొట్లాడేది కేసీఆరే



కొండమల్లేపల్లి రోడ్ షోలో మాట్లాడుతున్న కంచర్ల కృష్ణారెడ్డి



పెద్దవూరలో బీఆర్ఎస్ ప్రచార సభకు హాజరైన పార్టీ నాయకులు

- మోసపూరిత హామీలతో కాంగ్రెస్ మభ్యపెడుతోంది
- బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

కొండమల్లేపల్లి: తెలంగాణ ప్రజల కోసం కొట్లాడేది కేసీఆరే అని.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన రోడ్ షోలో వారు పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మాటలు సీఎం హోదాకు తగ్గట్టుగా లేదని, కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు తరలించుకుపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తాను రైతు బిడ్డనని, రైతు కష్టాలు తెలిసిన వ్యక్తినని పేర్కొన్న కంచర్ల కృష్ణారెడ్డి.. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ హామీల పట్ల ప్రజలు ఆలోచించాలని, కాంగ్రెస్ హామీలను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో బడుగుల లింగయ్యయాదవ్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కిషన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఎడారిగా మార్చిన కాంగ్రెస్

పెద్దవూర: అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే సాగర్ జలాశయంలో నీరు ఉన్నా ఆయకట్టును ఎడారిగా మార్చిన కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పెద్దవూర మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలను నమ్మి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ.. నాలుగు నెలల పరిపాలనలో కాంగ్రెస్ చేసింది శూన్యమన్నారు. బీఆర్ఎస్ నలగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలు రావాలంటే కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, ట్రికార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, నాయకులు విజయేందర్‌రెడ్డి, సుందర్‌రెడ్డి, రవినాయక్, లింగయ్య, అబ్బాస్, శ్రీనివాస్, డి. శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాదులకు వ్యతిరేకంగా సీపీఎం పోరాటం

- పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



రోడ్ షోలో మాట్లాడుతున్న రంగారెడ్డి

చండూరు: అవకాశ, మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడేది ఎర్రజెండానే అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం చండూరు మండలంలోని బోడంగిపర్తి, తాస్కానిగూడెం, చండూరు, బంగారిగడ్డ, దోనిపాముల, నెర్మట, కొండాపురం, గట్టుప్పల్, తేరట్‌పల్లి, వెల్మకన్నె గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టి నిరుద్యోగాన్ని పెంచి పోషించిందన్నారు. ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడే ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ మాట్లాడుతూ గట్టుప్పల్ మండల వ్యాప్తంగా ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేసే వరకు ఉద్యమిస్తామన్నారు. మునుగోడు ప్రాంతంలో ఇల్లు లేని నిరుపేదల కోసం ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, సాగునీరు, తాగునీరు కోసం అనేక ఉద్యమాలు చేపట్టిన చరిత్ర సీపీఎంకు ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, వెంకటేష్, కట్ట నరసింహ, అయితగోని విజయ్ కుమార్, నన్నూరి వెంకట రమణారెడ్డి, తుమ్మల పద్మ, మన్నె భిక్షం, శ్రీను, వల్లూరి శ్రీశైలం, బండారి కృష్ణయ్య, బండా నరేందర్, గిరి భిక్షం, కానుగుల నరసింహ, పోలే సత్యనారాయణ, జెర్రిపోతుల ధనంజయగౌడ్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నామినేషన్ల దాఖలు



నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ఆధార్ (అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్) పార్టీ అభ్యర్థి ఏడనాగ్ పుల్లారావు



నల్లగొండ ఎంపీ అభ్యర్థిగా ఎంసీపీఐ(యూ) పార్టీ తరఫున నామినేషన్ వేస్తున్న వసుతుల మట్టయ్య



ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేస్తున్న తలారి రాంబాబు

# రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

- మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో ఘటన

మిర్యాలగూడ అర్బన్: రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం జరిగింది. వివరాలు.. మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి వుందని స్థానికులు సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి జేబులో ఉన్న గుర్తింపుకార్డు ఆధారంగా సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కల్మల చెరువు గ్రామానికి చెందిన గుగులోతు విజయ్‌గా గుర్తించారు. అతడి జేబులో సూసైడ్ నోట్ కూడా లభ్యమైందని, అందులో 'నా చావుకి ఎవరూ బాధ్యులు కారు, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య చేసుకుంటున్నాను' అని రాసి ఉన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అంతేకాకుండా గ్రామంలో ఓ వ్యక్తి వద్ద రూ.5వేలు తీసుకున్నానని, అతడికి ఆ డబ్బులను ఇవ్వాలని రాయడంతో పాటు చివరగా అతడి అన్న, తండ్రి సెల్ నంబర్లు రాసి ఉంచాడు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు.



## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

కట్టంగూర్: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలంలోని కురుమర్తి గ్రామానికి చెందిన చల్ల భిక్షం(51) ఆదివారం నకిరేకల్‌లో తమ బంధువుల వివాహానికి బైక్‌పై వెళ్లాడు. వివాహం అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో అయిటిపాముల గ్రామ శివారులోకి రాగానే బైక్ అదుపుతప్పడంతో రోడ్డుపై పడిపోయాడు. అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని భిక్షంను అంబులెన్స్‌లో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సోమవారం మృతుడి కుమారుడు చల్ల జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్. శ్రీను తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో అర్చకుడికి తీవ్రగాయాలు

నార్కట్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో అర్చకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం సాయంత్రం నార్కట్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల శివాలయంలో ప్రధాన అర్చకుడు భగవన్‌శర్మ బస్టాండ్ నుంచి అమ్మనబోలు చౌరస్తా వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. గుర్తుతెలియని యువకులు బైక్‌పై అతివేగంగా వచ్చి అతనిని వెనుక నుంచి ఢీకొట్టారు. అర్చకుడికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన యువకులు బైక్‌ను అక్కడే వదిలేసి వెళ్లిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బైక్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

### స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలి

త్రిపురారం: మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కంపాసాగర్‌లో త్వరలో నిర్వహించనున్న తొలి కేవీకే స్వర్ణోత్సవాలను రైతులు విజయవంతం చేయాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస రావు సోమవారం కోరారు. సోమవారం కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న 16 కేవీకేల్లో మొదటి కేవీకే స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని కంపాసాగర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే కంపాసాగర్ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## బంగారం చోరీ చేసిన నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న శాలిగౌరారం సీఐ శ్రీనివాసరెడ్డి

కట్టంగూర్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ముగ్గురు నిందితులను సోమవారం కట్టంగూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో శాలిగౌరారం సీఐ సీ. శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎస్ఐ ఎన్. శ్రీను విలేకరులకు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌కు చెందిన రిటైర్డ్ టీచర్ మోత్కూరి లక్ష్మయ్య, లక్ష్మమ్మ దంపతులు జనవరి 23వ తేదీన హైదరాబాద్‌లో ఉంటున్న తమ కూమార్తె ఇంటికి వెళ్లేందుకు గాను నకిరేకల్‌లో సూర్యాపేట నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులో ఎక్కారు. మార్గమధ్యలో అయిటిపాముల సమీపంలోకి రాగానే దంపతులు తమ బ్యాగు చెక్ చేసుకోగా తమ వద్ద ఉన్న 20 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితులు కట్టంగూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా సోమవారం కట్టంగూర్ శివారులో నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. హైదరాబాద్ నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న లారీని ఆపారు. లారీలో నుంచి చిలుకూరు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన ఓర్సు కవిత, కోదాడ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సంపంగి యాదగిరి, తిరుపతమ్మ దంపతులు దిగి అనుమానాస్పదంగా వెళ్తుండగా వారిని పట్టుకొని విచారించగా తామే బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి 5తులాల బంగారు ఆభరణాలు, రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. నేరస్తులపై గతంలో మిర్యాలగూడ, హాలియా, సూర్యాపేట, ఖమ్మం పోలీస్ స్టేషన్‌లలో దొంగతనం కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. నిందితులను నకిరేకల్ కోర్టులో రిమాండ్ చేసినట్లు వివరించారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది వెంకన్న, సతీష్, రామలింగయ్య, రాంమోహన్, సైదులు, గౌతమి ఉన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని డీసీఎం డ్రైవర్ మృతి

- దామరచర్ల శివారులో ప్రమాదం

మిర్యాలగూడ : గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో డీసీఎం డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన దామరచర్ల మండల కేంద్రం శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగింది. దామరచర్ల ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా పట్టణానికి చెందిన దేవనబోయిన కృష్ణయ్య(55) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దామరచర్ల మండల కేంద్రంలో డీసీఎం పంక్చర్ కావడంతో సోమవారం తెల్లవారుజామున పంక్చర్ దుకాణం వద్ద టైర్ పంక్చర్ చేయించుకుని డీసీఎం ఎక్కుతుండగా.. మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం కృష్ణయ్యకు ఢీకొట్టింది. దీంతో కృష్ణయ్య తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

# ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు.. ఇద్దరు మృతి



మహేందర్ (ఫైల్)



లచ్చు (ఫైల్)

పెద్దవూర: ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం రాత్రి పెద్దవూర మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలం పంగవానికుంట గ్రామానికి చెందిన నీలం మహేందర్(21) బైక్‌పై గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లి ఆదివారం రాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో కొండమల్లేపల్లి మండలం కొర్రోనితండాకు చెందిన నేనావత్ లచ్చు (35) పెద్దవూర వైపు నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. లచ్చు బైక్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ పెద్దవూర మండల కేంద్రంలోని విశ్వనాథ్ స్పిన్నింగ్ మిల్లు సమీపంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై మల్లేపల్లి వైపు నుంచి వస్తున్న మహేందర్ బైక్‌ను ఎదురుగా ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ బైక్‌ల పైనుంచి ఎగిరి రోడ్డుపై పడిపోయారు. ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. నీలం మహేందర్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మహేందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నేనావత్ లచ్చును చికిత్స నిమిత్తం 108 వాహనంలో నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. లచ్చు పరిస్థితి విషమంగా ఉండటంతో నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు నీలం మహేందర్ అవివాహితుడు కాగా పంగవానికుంట గ్రామంలో కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నేనావత్ లచ్చుకు భార్య మంజుల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు మహేందర్ సోదరుడు భిక్షం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. వీరబాబు తెలిపారు.